సాక్షి విశాఖపట్నం

శనివారం ၊ 24 ၊ ఫిబ్రవరి ၊ 2024



అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

పలు రాష్ట్రాల్లో 152 చోరీ కేసులున్న అంతర్‌ రాష్ట్ర దొంగను విశాఖ పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. 8లో



మోత మోగిన కబడ్డీ కూత

ఆల్‌ ఇండియా మేజర్‌ పోర్ట్స్‌ కబడ్డీ చాంపియన్‌షిప్‌ ప్రారంభమైంది. ఎంతో సందడిగా తొలిరోజు పోటీలు జరిగాయి. 8లో



విశాఖలో ‘ఆపరేషన్‌ వాలెంటైన్‌’

ఆపరేషన్‌ వాలెంటైన్‌ చిత్ర యూనిట్‌ విశాఖలో సందడి చేసింది. చిత్ర హీరో వరుణ్‌తేజ్‌ మీడియాతో మాట్లాడుతూ దేశ భక్తిని పెంపొందించేలా చిత్రం ఉంటుందని తెలిపారు. ఈ చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, పాన్‌ ఇండియా లెవెల్‌లో మార్చి 1న విడుదల చేస్తున్నామన్నారు. 8లో

న్యూస్‌రీల్‌

నేడు విశాఖకు వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి శనివారం విశాఖకు రానున్నారు. ఉదయం 10 గంటలకు ఎయిర్‌పోర్టులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడ నుంచి వందలాది బైక్‌లు, కార్లతో ర్యాలీగా బయలుదేరి ఎన్‌ఏడీ జంక్షన్‌, బిర్లా జంక్షన్‌, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్‌, ఎంవీపీ కాలనీ డబుల్‌రోడ్డు జంక్షన్‌ మీదుగా ఎండాడలోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్‌ విగ్రహానికి నివాళులర్పిస్తారు. పార్టీ శ్రేణులు, నాయకులు అభినందనలు తెలిపిన అనంతరం సుబ్బారెడ్డి మధ్యాహ్నం 12 గంటలకు మీడియాతో మాట్లాడనున్నారు.

జేసీఎస్‌ క్లస్టర్‌ ఇన్‌చార్జుల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్‌ (జగనన్న సచివాలయ కన్వీనర్‌ అండ్‌ గృహసారథి) మండల/క్లస్టర్‌ ఇన్‌చార్జులను నియమించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ క్లస్టర్‌-3 జేసీఎస్‌ ఇన్‌చార్జిగా సనపల రవీంద్ర భారత్‌, భీమిలి నియోకజవర్గ క్లస్టర్‌-3 జేసీఎస్‌ మండల ఇన్‌చార్జిగా పోతిన హనుమంత రావు, పెందుర్తి మండల ఏసీఎస్‌ ఇన్‌చార్జిగా బొడ్డు సూర్య ప్రకాష్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది.

ఫ్లాష్‌.. ఫ్లాష్‌...

150 తులాల బంగారం చోరీ

సీతమ్మధార: దొండపర్తిలోని బాలాజీ మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో 150 తులాల బంగారం చోరీకి గురైనట్టు శుక్రవారం రాత్రి క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలాజీ మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న రిటైర్డ్‌ పోస్టల్‌ అధికారి ఎ.ప్రసాద్‌బాబు కుటుంబం శుక్రవారం రాత్రి పెళ్లికి వెళ్లేందుకు ఇంట్లోని బీరువా తీసి చూడగా అందులో ఉండవలసిన 150 తులాల బంగారం ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఫోర్త్‌టౌన్‌ క్రైమ్‌ పోలీసులకు తెలియజేశారు. ఏడీసీపీ గంగాధర్‌, ఏసీపీ వెంకటరావు, సీఐ ఆదమ్‌ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. తరచూ ఇంటికి వచ్చే వ్యక్తే చోరీ చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. 60 తులాల బంగారం చోరీకి గురైనట్టు భావిస్తున్నారు.

ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్‌ మల్లికార్జున

ఏయూక్యాంపస్‌: ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్‌ మల్లికార్జున పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో భాగంగా మార్చి 1న ప్రధాని విశాఖ వస్తున్న నేపథ్యంలో ఏయూ వేదికగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నగర సీపీ రవిశంకర్‌, జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ, ఏడీసీ విశ్వనాథన్‌, ఏయూ రిజిస్ట్రార్‌ ఆచార్య ఎం.జేమ్స్‌ స్టీఫెన్‌, హెచ్‌పీసీఎల్‌ ఉన్నతాధికారులతో కలిసి ఏయూ మైదానాన్ని సందర్శించారు. ఏయూ ఇంజినీరింగ్‌ కళాశాల మైదానంలో ఉన్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్‌, హెచ్‌పీసీఎల్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్లు రాజీవ్‌ గోయల్‌, అభిషేక్‌ త్రివేది, సురేంద్ర గుప్త, సీజీఎం(హెచ్‌ఆర్‌) కిరణ్‌ కుమార్‌ ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేరువలో ఉన్నత విద్య..!

- ప్రతీ మండలంలో రెండు జూనియర్‌ కళాశాలలు
- విశాఖలో 3, అనకాపల్లిలో 3, అల్లూరి జిల్లాలో రెండు..
- రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లకు ఉద్యోగోన్నతులు



కాలేజీగా అప్‌గ్రేడ్‌ అవుతున్న కురుపాం జీవీఎంసీ హైస్కూల్‌

విశాఖ విద్య: పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేలా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్‌ కళాశాలలు అందుబాటులో ఉండేలా, ఇందులో ఒకటి బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అవసరమైన చోట్ల దశల వారీగా కొత్త కళాశాలల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్తగా ఎనిమిది జూనియర్‌ కాలేజీలు మంజూరు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో జూన్‌ 1 నుంచి కాలేజీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైస్కూళ్లలో పనిచేసే క్వాలిఫైడ్‌ ఉపాధ్యాయులను కొత్త కాలేజీల్లో సబ్జెక్టు అధ్యాపకులుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. వీరికి ఒక ఇంక్రిమెంట్‌ ఇవ్వనున్నారు.

జిల్లాల వారీగా..

- విశాఖ జిల్లాలో గోపాలపట్నం మండలం వెంకటాపురం, మహారాణిపేట మండలం జీవీఎంసీ ఎంవీడీఎంహెచ్‌ఎస్‌ కురుపాం మార్కెట్‌, పద్మనాభం మండలం రెడ్డిపల్లి అగ్రహారంలో జూనియర్‌ కాలేజీ మంజూరైంది.
- అనకాపల్లి జిల్లాలో అచ్యుతాపురం, నాతవరం, ఎస్‌. రాయవరం మండలం కొరుప్రోలు,
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, పెదబయలు మండలం సీతగుంటలో కాలేజీలను మంజూరు చేశారు. ప్లస్‌-2 స్కూళ్లగా గుర్తించే వీటిని పాఠశాలల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతీ చోటా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఏర్పాటుకు గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారు. ప్రతీ గ్రూపులో 40 మంది చొప్పున విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని ఆదేశించారు.

పట్టించుకోని గత టీడీపీ ప్రభుత్వం

కొత్తగా జూనియర్‌ కళాశాల మంజూరు కోసం గతంలో అయితే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. అందుబాటులో కళాశాలలు లేక, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది విద్యార్థినులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఉండేవి. దీన్ని గుర్తించిన దివంగత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకేసారి ఏకంగా 34 కస్తూర్బా గాంధీ విద్యాలయాలను మంజూరు చేశారు. ఆ తరువాత వచ్చిన పాలకులెవ్వరూ కొత్త విద్యాసంస్థల మంజూరుకు శ్రద్ధ తీసుకోలేదు. మళ్లీ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి తనయుడు వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి పాలనలోనే కొత్తగా జూనియర్‌ కాలేజీలు ఏర్పాటవుతుండటం గమనార్హం. వీటితో కలిపి ఈ నాలుగున్నకాలంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 18 కాలేజీలు మంజూరయ్యాయి.

రూ.16కోట్లతో ఆర్‌వోబీ పనులకు శ్రీకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్‌, చిత్రంలో మేయర్‌ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌ సీపీ గాజువాక సమన్వయకర్త చందు తదితరులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని రైల్వే ఓవర్‌ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ ఆటోనగర్‌లో రైల్వే ఓవర్‌ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.16 కోట్లతో నిర్మించనున్న ఆర్‌ఓబీ పనులకు ప్రారంభం కానున్నాయన్నారు. వంతెన పూర్తయితే తుంగ్లాం నుంచి ఎఫ్‌, ఈ బ్లాక్‌లతో పాటు వడ్లపూడి, అగనంపూడి, ఫకీర్‌తక్యా తదితర ప్రాంతాల వైపు వెళ్లడానికి, మరో వైపున ఎఫ్‌, ఈ బ్లాక్‌ల నుంచి తుంగ్లాం, చుక్కవానిపాలెంతో పాటు గాజువాక, షీలానగర్‌ తదితర ప్రాంతాలకు ప్రయాణించే వారికి ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. వంతెన పనులపై స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఇప్పటికే 11 ఫ్లై ఓవర్లు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. కార్యక్రమంలో నగర మేయర్‌ గొలగాని హరివెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక వైఎస్సార్‌ సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), ఐలా జెడ్‌ ఎం.త్రినాథ్‌, కమిషనర్‌ జయచంద్ర, కార్పొరేటర్లు కాకి గోవింద రెడ్డి, బొండా జగన్‌, వైఎస్సార్‌ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్‌, నాయకులు చిత్రాడ వెంకటరమణ, విజయరామరాజు, పలువురు ఐలా ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షకు సర్వం సిద్ధం

- జిల్లాలో 105 కేంద్రాల్లో రేపు పరీక్ష
- హాజరుకానున్న 47,491 మంది అభ్యర్థులు
- సమన్వయంతో విజయవంతం చేయాలి
- జాయింట్‌ కలెక్టర్‌ మయూర్‌ అశోక్‌
- ఆర్‌వో, ఎల్‌వో, సీఎస్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న జేసీ అశోక్‌

విశాఖ విద్య: ఆంధ్రప్రదేశ్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్‌ – 2 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జాయింట్‌ కలెక్టర్‌ కె. మయూర్‌ అశోక్‌ అన్నారు. ఏపీపీఎస్సీ పరీక్ష నిర్వహణపై రూట్‌ ఆఫీసర్స్‌ (ఆర్వో), లైజన్‌ ఆఫీసర్స్‌ (ఎల్‌ఓ), చీఫ్‌ సూపరింటెండెంట్లకు (సీఎస్‌) శుక్రవారం నగరంలోని వుడా చిల్డ్రన్స్‌ ఎరీనాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి సమన్వయాధికారిగా వ్యవహరించిన జేసీ మయూర్‌ అశోక్‌ మాట్లాడుతూ ఆదివారం జరిగే గ్రూప్‌-2 పరీక్షకు జిల్లాలో 47,491 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 105 కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు 29 మంది ఆర్వోలు, 105 మంది ఎల్‌ఓలు, 105 మంది సీఎస్‌లను నియమించామన్నారు. ఈసారి ఏపీపీఎస్సీ కొత్తగా కొన్ని మార్పులు తీసుకు వచ్చిందని, వాటికి అనుగుణంగా అధికారులు నడుచుకోవాలన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు, ఫర్నిచర్‌, విద్యుత్‌, తాగునీరు వంటి ఏర్పాట్లను సంబంధిత అధికారులు ముందుగానే పరిశీలించాలన్నారు. పరీక్షకు 10 నిమిషాల ముందు మాత్రమే ప్రశ్నాపత్రాలను ఇన్విజిలేటర్లకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్‌, ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ కేవీ ప్రసాద్‌, అసిస్టెంట్‌ సెక్రెటరీ ఎన్‌.వి.సుబ్బయ్య, సెక్షన్‌ ఆఫీసర్‌ సుధాకర్‌ బాబు, కలెక్టర్‌ కార్యాలయ పర్యవేక్షకులు డి.రవి, సిబ్బంది ఎ. సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు సూచనలు..

- అభ్యర్థులు తమతో పాటు ఎటువంటి బ్యాగులు, పర్సులు, ఎలక్ట్రానిక్‌ పరికరాలు, బుక్‌లెట్లను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకూడదు
- పరీక్షా సమయానికి గంట ముందు కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి 15నిమిషాల తర్వాత అనుమతించరు.
- 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులు తమతో సహాయకులను తీసుకురావచ్చు. అయితే వారు డిగ్రీ కంటే తక్కువ విద్యను అభ్యసించిన వారై ఉండాలి.
- పరీక్ష సమయం పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రాన్ని అభ్యర్థులు విడిచి వెళ్లకూడదు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా

- దళితుడినైన నన్ను రాజ్యసభ సభ్యుడ్ని చేశారు
- గొల్ల బాబూరావు
- ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును పూలమాలలతో ముంచెత్తిన వైఎస్సార్‌ సీపీ శ్రేణులు



వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, చిత్రంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు తదితరులు

గోపాలపట్నం/బీచ్‌రోడ్డు: దళితుడినైన తనకు రాజకీయంగా మహానేత వైఎస్సార్‌ అవకాశం కల్పిస్తే.. ఆయన తనయుడు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తమ భవిష్యత్తు కల్పించారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. ఎయిర్‌పోర్టు నుంచి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు పీవీఆర్‌ ప్రసాద్‌ ఆధ్వర్యంలో బైక్‌లు, కార్లతో ర్యాలీగా డాబాగార్డెన్స్‌ సర్కిల్‌కు చేరుకుని డాక్టర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బీచ్‌ రోడ్డులోని వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ ఒక దళితుడికి రాజ్యసభ సీటు ఇవ్వడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఈ సీటు బాబురావుకు కాదు దళితులందరికీ దక్కిన గౌరవమన్నారు. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. రాజ్యసభ సీటు పేరు చెప్పి వర్ల రామయ్యను చంద్రబాబు మోసం చేశారన్నారు. రాజ్యసభ సీట్లను వందల కోట్లకు అమ్ముకున్న చరిత్ర ఆయనదని విమర్శించారు. సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమవుతోందని మరోమారు రుజువైందన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల అభినందనలు

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌ లీడర్‌ కె.హనోక్‌, కార్పొరేటర్లు, కార్పొరేషన్‌ చైర్మన్లు, డైరెక్టర్లు బాబూరావుకు అభినందనలు తెలిపారు. తనకు అభినందనలు తెలపడానికి వచ్చిన పార్టీ నేతలు, అభిమానులకు బాబూరావు కృతజ్ఞతలు తెలిపారు.

విమ్స్‌లో సీబీఆర్‌ఎన్‌ సెంటర్‌ ఏర్పాటుకు సన్నాహాలు



విమ్స్‌లో స్థలం పరిశీలిస్తున్న అనురాధ

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌(విమ్స్‌)లో కేంద్ర ప్రభుత్వం సెకండరీ లెవెల్‌ ‘కెమికల్‌ బయోలాజికల్‌ రేడిలాజికల్‌ అండ్‌ న్యూక్లియర్‌ (సీబీఆర్‌ఎన్‌)’ మెడకల్‌ మేనేజ్‌మెంట్‌ సెంటర్‌ ఏర్పాటుకు వైద్యాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సీనియర్‌ రీజినల్‌ డైరెక్టర్‌ ఎం.అనురాధ ఆధ్వర్యంలో బృందం శుక్రవారం విమ్స్‌ను సందర్శించింది. విమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కె.రాంబాబు, వైద్యులతో కలసి ఈ బృందం సీబీఆర్‌సీ ఏర్పాటు, మౌలిక సదుపాయాల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో స్పైనల్‌ రిహేబిలిటేషన్‌ సెంటర్‌, బ్లడ్‌ బ్యాంక్‌, క్యాజువాలిటీ, వార్డులను పరిశీలించారు. సెంట్రల్‌ డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ సీనియర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ యోగేష్‌, చీఫ్‌ ఇంజినీర్‌ కె.రాజీవ్‌, డిప్యూటీ ఆర్కిటెక్టులు ఇమ్రాన్‌ ఖాన్‌, సచిన మహేంద్రలతో జూమ్‌ మీటింగ్‌లో సంప్రదించారు. కార్యక్రమంలో విమ్స్‌ ఆర్‌ఎంవో డాక్టర్‌ శ్యాంకుమార్‌, స్టేట్‌ కమిషనర్‌ ఆఫ్‌ ఫ్యామిలీ అండ్‌ వెల్ఫేర్‌ ఎస్‌.ఎన్‌.ఓ డాక్టర్‌ మోహన్‌కృష్ణ, విమ్స్‌ పరిపాలనాధికారి డాక్టర్‌ షేక్‌ బాజిత్‌, అనస్తీషియా అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ హరికృష్ణ పాల్గొన్నారు.

436 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా శుక్రవారం పెందుర్తిలో నిర్వహించిన శిబిరంలో 436 మందికి వైద్య సేవలందించారు. ఓ రోగిని వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్‌ ఆస్పత్రికి సిఫారసు చేశామని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. మళ్లీ 27న భీమిలి మండలం అన్నవరం, ఆనందపురం మండలం చందకలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

‘ఐలా’పై కార్పొరేటర్‌ ‘కాకి’ వీరంగం

- అసభ్య పదజాలంతో దూషణ
- ఆగ్రహం వ్యక్తం చేసిన పారిశ్రామిక వేత్తలు
- పోలీసుస్టేషన్‌లో క్షమాపణలు చెప్పిన కాకి గోవిందరెడ్డి



పారిశ్రామికవేత్తలతో కాకి గోవిందరెడ్డి వాగ్వాదం

అక్కిరెడ్డిపాలెం : కాకి గోవిందరెడ్డి వివాదస్పద కార్పొరేటర్‌. 69వ వార్డు నుంచి ఎన్నికైన ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేయడం..బెదిరింపులకు పాల్పడడం నైజం. తాజాగా ఆటోనగర్‌లో ఐలా చైర్మన్‌ కె.సత్యనారాయణరెడ్డి (రఘు)పై అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో కాకిగోవిందరెడ్డి ఆయన అనుచరులపై పారిశ్రామిక వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా... శుక్రవారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ చేతుల మీదుగా రైల్వే ఓవర్‌ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగాల్సి ఉంది. మంత్రితో ప్రారంభోత్సవం చేయాల్సిన శిలాఫలకానికి పక్కనే మరో శిలాఫలకాన్ని ఇంజినీరింగ్‌ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అటు పారిశ్రామిక వేత్తలు, ఇటు కార్పొరేటర్‌ కాకి గోవింద రెడ్డి, అతని అనుచరులు హాజరయ్యారు. తన అనుమతి లేకుండా శిలాఫలకం ఎలా ఏర్పాటు చేస్తారని కాకి గోవిందరెడ్డి వాగ్వాదానికి దిగాడు. ఐలా చైర్మన్‌ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు)పై అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. పలువురు పారిశ్రామిక వేత్తలు కార్పొరేటర్‌ వర్గాన్ని నిలువరించేందుకు యత్నించారు. జరిగిన ఘటనతో అవమానకరంగా భావించిన పారిశ్రామిక వేత్తలు మూకుమ్మడిగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరగకముందే వెళ్లిపోయారు. కార్పొరేటర్‌తో పాటు అతని అనుచరుల తోపులాటలో ఇద్దరు పారిశ్రామివేత్తలకు స్వల్పగాయాలయ్యాయని ఐలా చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి తెలిపారు. తాము ఎప్పుడూ గ్రామస్తుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఆర్‌ఓబీ పనుల ప్రారంభాన్ని త్వరతగతిన చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఒక ప్రజా ప్రతినిధిగా కార్పొరేటర్‌ ఈ విధంగా ప్రవర్తించడం దారుణమని ఐలా చైర్మన్‌ రఘుతో పాటు పారిశ్రామిక వేత్తలు, ఐలా ప్రతినిధులు మీడియా సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఐలా ప్రతినిధులు గాజువాక పోలీసు స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని సీఐ శ్రీనివాసరావుకు చెప్పారు. దీంతో కాకి గోవిందరెడ్డిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి ఐలా ప్రతినిధులకు క్షమాపణలు చెప్పించారు.

ముందస్తు స్క్రీనింగ్‌తో మెరుగైన ఆరోగ్యం

రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తత, అవగాహనతో రక్షణ

విశాఖ సిటీ : రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, అప్రమత్తతతోనే రక్షణ పొందడం సులభమని ప్రముఖ ప్లాస్టిక్‌, మైక్రోసర్జన్‌ డాక్టర్‌ సుమితా శంకర్‌ పేర్కొన్నారు. నగర పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ ఎ.రవిశంకర్‌ అధ్యక్షతన రోటరీ క్లబ్‌, వాల్తేర్‌ సహకారంతో శుక్రవారం మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం బ్రెస్ట్‌ క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ క్యాంప్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మందికిపైగా పోలీస్‌ మహిళా అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్‌ సుమితా శంకర్‌ మాట్లాడుతూ బ్రెస్ట్‌ క్యాన్సర్‌ నివారణకు ముందస్తు స్క్రీనింగ్‌ ఆవశ్యకతను వివరించారు. దీన్ని ముందుగా గుర్తించడం ద్వారా 90 శాతం మనుగడ ఉంటుందని తెలిపారు. మహాత్మాగాంధీ క్యాన్సర్‌ హాస్పిటల్‌ మెడికల్‌ అంకాలజిస్ట్‌ డాక్టర్‌ రజినీప్రియ మాట్లాడుతూ బ్రెస్ట్‌ క్యాన్సర్‌ నివారణలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను సూచించారు. అనంతరం నగర పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ ఎ.రవిశంకర్‌ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండడం, తొలి దశలో గుర్తించడం ద్వారా దీన్ని పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. అందుకే రోటరీ క్లబ్‌ ఆఫ్‌ వాల్తేర్‌ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బ్రెస్ట్‌ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సుమితా శంకర్‌ రచించిన ‘కంప్లీట్‌ గైడ్‌ టు బ్రెస్ట్‌ హెల్త్‌’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పోలీస్‌ కమిషనర్‌ రవిశంకర్‌ ఈ పుస్తకాన్ని తెలుగులో అనువదించి రాష్ట్రంలో ఉన్న పోలీసులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ లెనోరా, జాయింట్‌ సీపీ ఫకీరప్ప, డీసీపీ(క్రైం)పి.వెంకటరత్నం, ఇతర పోలీస్‌ అధికారులు, రోటరీ క్లబ్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.



డాక్టర్‌ సుమితా శంకర్‌ రాసిన పుస్తకాన్ని, ఆవిష్కరించిన నగర పోలీస్‌ కమిషనర్‌ రవిశంకర్‌

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు

- సీఈవోకు వివరించిన కలెక్టర్ మల్లికార్జున


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట: పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఆర్వోలు, ఈఆర్వోలు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,941 పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 6, 7, 8 ఫారాలు 60,437 రాగా.. వాటిలో కొన్ని పరిశీలించి ఆమోదించామన్నారు. ప్రస్తుతం 33,377 ఫారాలు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. వారంలోగా పరిష్కార చర్యలు చేపడతామన్నారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అధికారులు, సిబ్బందిని ఆయా కేంద్రాల అవసరాలను పరిగణలోకి తీసుకుని కేటాయించామన్నారు. సీఈవోతో సమావేశం అనంతరం కలెక్టర్ స్థానిక అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వారంలోగా పెండింగ్ దరఖాస్తులను శతశాతం పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల ప్రకారం ఓటర్ల జాబితాను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు.

పీపీపీ విధానంలో ఈస్ట్ క్యూ-6 బెర్త్ అభివృద్ధి

- మెస్సర్స్ ఎవర్‌సన్ మెరైన్‌కు అప్పగింత


చైర్మన్ డా.అంగముత్తు సమక్షంలో యాంత్రీకరణ బెర్తు పనులు అప్పగిస్తున్న సెక్రటరీ వేణుగోపాల్

సాక్షి, విశాఖపట్నం : ల్యాండ్ లార్డ్ పోర్టుగా అభివృద్ధి చెందుతూ మేజర్ పోర్టులను అధిగమించేందుకు పూర్తిగా ఉన్న వనరులను వినియోగించుకుంటూ ఆధునికీకరణ బాట పట్టామని విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. పోర్టు ఇన్నర్ హార్బర్‌లోని ఈక్యూ 6 బెర్త్ అభివృద్ధి, యాంత్రీకరణ చేసే పనులను మెస్సర్స్ ఎవర్ సన్ మెరైన్ ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వీపీఏ అప్పగించింది. పీపీపీ విధానంలో ఈ పనులను సదరు సంస్థ చేపట్టనుంది. పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, సెక్రటరీ వేణుగోపాల్, ఇతర అధికారుల సమక్షంలో సంస్థ ప్రతినిధులకు అగ్రిమెంట్ పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం 255 మీటర్ల పొడవుతో ఈ క్యూ 6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణతో ఉందని, యాంత్రీకరణలో భాగంగా కొత్తగా 1500 టన్ పర్ అవర్ (హెచ్ఎంసీ) సామర్థ్యం కలిగిన హార్బర్ మొబైల్ క్రేన్, 150 టన్నుల మొబైల్ హోపర్‌లు అందుబాటులోకి రానున్నాయన్నారు. వీటితో పాటు క్రేన్‌లు లోడర్స్, ట్రక్స్, ఫోర్క్ లిఫ్టులు తదితర యంత్రాలు కూడా ఏర్పాటు కానున్నట్లు వివరించారు. రూ.66.12 కోట్ల విలువైన ఈ ఆధునికీకరణ పనుల వల్ల ఈ క్యూ 6 బెర్త్ అన్ని రకాల సరుకు రవాణా చేసే సామర్థ్యంపాటు ఏడాదికి 2.62 మిలియన్ మెట్రిక్ సరుకును రవాణా చేసే సామర్థ్యానికి చేరుకోనుందని తెలిపారు. బెర్త్‌ను ఆధునికీకరించడం ద్వారా 50,000 డీడబ్ల్యూ టీ సామర్థ్యం, 200 మీటర్ల పొడవు 32 మీటర్ల బీమ్, 11.50 మీటర్ల డ్రాఫ్ట్ కలిగిన భారీ నౌకలను సైతం హ్యాండిల్ చేసే అవకాశం కలుగుతుందన్నారు. 15 నెలల్లో సదరు సంస్థ పనులు పూర్తి చేయాల్సి ఉంటుందనీ.. 30 ఏళ్ల వరకూ ఈ బెర్త్ నిర్వహణ ఆ సంస్థ పర్యవేక్షిస్తుందని వివరించారు.

పట్టపగలే చోరీలు..152 కేసులు

- అంతర్ రాష్ట్ర ఘరానా దొంగ అరెస్ట్
- మధురానగర్‌లోని ఇంట్లో చోరీకి పాల్పడిన శ్రీనివాస్
- బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో నిందితుడి పట్టివేత
- అతనిపై వివిధ రాష్ట్రాల్లో కేసుల నమోదు
- రూ.13.06 లక్షల చోరీ సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

విశాఖ సిటీ: రెండు తులాల చోరీ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పలు రాష్ట్రాల్లో 152 చోరీ కేసులున్న అంతర్‌రాష్ట్ర దొంగను పట్టుకున్నారు. మధురానగర్ ప్రాంతంలో పట్టపగలు ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ చేసిన ఘరానా దొంగ నుంచి ఏకంగా రూ.13.06 లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోరీ కేసును ఛేదించినట్లు డీసీపీ(క్రైం) పి.వెంకటరత్నం తెలిపారు. ఘటనా స్థలంలో ఆధారాలు, సాంకేతికత సహాయంతో చోరీకి పాల్పడ్డింది పాత నేరస్తుడు కామేపల్లి శ్రీనివాస్ అలియాస్ కృష్ణమోహన్‌గా గుర్తించి.. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం అరెస్ట్ చేసినట్లు వివరించారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. శ్రీనివాస్‌పై విశాఖలోని పలు స్టేషన్లలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో 152 చోరీ కేసులు ఉన్నాయని వివరించారు. వివరాలివీ..

ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధి మధురానగర్ ప్రాంతంలోని కీర్తన రెసిడెన్సీలో నూలు వరలక్ష్మి కుటుంబం నివాసముంటోంది. ఈ నెల 10న వారు బయటకు వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళం విరిగిపోయి ఉంది. లోపల బీరువాలో ఉండాల్సిన సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వారు వెంటనే ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీఎస్ ఏసీపీ ఎ.వెంకటరావు, ద్వారకా సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పాటై దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో ఆధారాలు, సాంకేతికత సహాయంతో చోరీకి పాల్పడింది పాత నేరస్తులే అని గుర్తించి వారిపై నిఘా పెట్టారు.

రూ.13.06 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

పాత నేరస్తుడు శ్రీనివాస్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఎస్‌వీటీ టీ షాప్ ప్రాంతంలో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు.. వెంటనే అక్కడికి వెళ్లి చాకచక్యంగా పట్టుకున్నారు. అతడిని విచారించగా మధురానగర్ ఇంట్లో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిడదవోలు రైల్వే స్టేషన్ సమీపంలో నివాసముంటున్న శ్రీనివాస్ ప్రస్తుత మైసూర్, గోవా, చెన్నై తదితర ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తూ జల్సాగా తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతని నుంచి రూ.12.45 లక్షలు విలువ చేసే 249 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ.26,400 విలువ చేసే 660 గ్రాముల వెండి, ఓ ల్యాప్‌టాప్, మూడు మద్యం బాటిళ్లు ఇలా రూ.13.06 లక్షలు విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా 197 గ్రాముల బంగారు ఆభరణాలను మైసూర్‌లోని అట్టికా గోల్డ్‌లో విక్రయించినట్లు అంగీకరించాడు. న్యాయ సలహా మేరకు విక్రయించిన ఆ బంగారు ఆభరణాలను కూడా బాధితులకు అప్పగిస్తామని డీసీపీ వెంకటరత్నం తెలిపారు.

పగటి పూటే చోరీలు

శ్రీనివాస్ పగటి పూటే చోరీ చేయడంలో సిద్ధహస్తుడు. ఆంధ్రా, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, గోవా ఇలా పలు రాష్ట్రాల్లో పగటి పూట ఇంటికి తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటాడు. ఇనుపరాడ్‌తో ఇంటి తాళం, గొళ్లెం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం విరగొట్టి విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్స్ దొంగతనం చేస్తుంటాడు. శ్రీనివాస్ ఇప్పటివరకు విశాఖలో మధురానగర్, గాజువాక, హనుమంతవాక, ఆరిలోవ, షీలానగర్ ప్రాంతాల్లో ఎనిమిది చోరీలకు పాల్పడ్డాడు.

చిరు ధాన్యాలతో మిలాన్ లోగో



మిలాన్ లోగోతో విజయ్‌కుమార్

ఏయూక్యాంపస్: నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చిరుధాన్యాలను ఉపయోగించి.. మిలాన్ లోగోను తీర్చిదిద్దారు. దాదాపు వారం రోజుల పాటు శ్రమించి.. అరికలు, సామలు, కొర్రలు వంటివి ఉపయోగించి ఈ లోగోను రూపొందించారు. ప్రజల్లో చిరుధాన్యాల పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా.. సందర్భానుసారంగా ఇటువంటి చిత్రాలను తీర్చిదిద్దుతున్నట్లు విజయ్‌కుమార్ చెప్పారు.

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పద్మావతి

విశాఖ విద్య: ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా చంద్ర పద్మావతి ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ తరఫున జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు శుక్రవారం వెల్లడించారు. పీఎంపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్న పద్మావతి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో.. సంఘం నాయకులతో కలసి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

మోత మోగిన కబడ్డీ కూత

- ఉత్సాహంగా ప్రారంభమైన మేజర్ పోర్ట్స్ కబడ్డీ పోటీలు
- ఆధిక్యంలో ముంబయి, చెన్నై పోర్టు జట్లు


వీపీఏ డిఫెండర్స్‌పై రైడ్ చేస్తున్న జేఎన్‌పీఏ పోర్టు క్రీడాకారుడు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజు జరిగిన పోటీల్లో గత ఏడాది ఫైనలిస్టులు ముంబయి, చెన్నై పోర్టు జట్లు ఆధిక్యాన్ని కొనసాగిస్తున్నాయి. విశాఖ పోర్ట్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో ఎనిమిది మేజర్ పోర్ట్‌ల జట్లు రెండు పూల్స్‌లో తలపడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా ముంబయి(ఎంపీఏ)తో పాటు జవహర్‌లాల్ నెహ్రూ(జేఎన్‌పీఏ), న్యూ మంగళూర్(ఎన్ఎంపీఏ), విశాఖ పోర్ట్(వీపీఏ) జట్లు ఏ పూల్‌తో ఆడుతుండగా.. గతేడాది రన్నరప్ చెన్నై(సీహెచ్‌పీఏ)తో పాటు పారాదీప్(పీపీఏ), ట్యుటికోరిన్(వీవోసీఏ), కాండ్ల(డీవోపీఏ) జట్లు బి పూల్‌లో ఆడుతున్నాయి. తొలిరోజు సీహెచ్‌పీఏ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించగా, ఎంపీఏ జట్టు ఆడిన మ్యాచ్‌లో విజయంతో శుభారంభం చేసింది. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనుండగా తొలి మ్యాచ్‌లో వీపీఏ జట్టు 35-20పాయింట్ల తేడాతో ఎన్ఎంపీఏపై విజయం సాధించింది. ఆట అర్ధ భాగంలోనే వీపీఏ జట్టు 26-10తో ఆధిక్యాన్ని ప్రదర్శించింది. బీ పూల్‌లో జరిగిన మ్యాచ్‌లో సీహెచ్‌పీఏ 52-6తో డీవోపీఏ జట్టుపై తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తొలి అర్ధభాగంలో 29-2 పాయింట్ల తేడాతో హరికృష్ణ 20, ఎస్.సింగ్ 15 పాయింట్లు సాధించి మ్యాచ్‌ను డిసైడ్ చేశారు. మరో మ్యాచ్‌లో ఎంపీఏ జట్టు 53-29తో జేఎన్‌పీఏ జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలోనే 39-14తో ఆధిక్యాన్ని ప్రదర్శించగా సౌరభ్ 29, ప్రతీక్ 11 పాయింట్లతో ఎంపీఏ జట్టుకు విజయాన్ని సాధించిపెట్టారు. ఇంకో మ్యాచ్‌లో పీపీఏ జట్టు 69-15తో డీవోపీఏ జట్టుపై విజయం సాధించింది. ప్రోకబడ్డీ ఆటగాడు శంకరరావు డిఫెండర్‌గా ఏడు పాయింట్లను డీవోపీఏ తరఫున సాధించాడు. మరో మ్యాచ్‌లో సీహెచ్‌పీఏ 71-61తో వీవోసీఏ జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలోనే 41-28తో ఆధిక్యాన్ని ప్రదర్శించగా సీహెచ్‌పీఏ తరఫున కామేశ్వరరావు 22, దినేష్ 19 పాయింట్లను సాధించి విజయంలో కీలకపాత్ర పోషించారు. చివరి మ్యాచ్‌లో వీపీఏపై 17-31తో జేఎన్‌పీఏ జట్టు విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 6-16తో ఆధిక్యాన్ని ప్రదర్శించగా జేఎన్‌పీఏ తరఫున పార్థ్‌పటేల్ 18 పాయింట్లతో జట్టుకు విజయాన్నందించాడు. తొలుత ఈ పోటీలను వీపీటీ చైర్మన్ ఎం.అంగముత్తు ప్రారంభించారు. క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి గాల్లో బెలూన్లను విడిచిపెట్టారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు పీఎల్ స్వామి, టి.వేణుగోపాల్, ఎస్.శివకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన 'వృద్ధుల' జాతీయ సదస్సు

డాబాగార్డెన్స్: వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై విశాఖలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. కేంద్ర న్యాయ సాధికార మంత్రిత్వ శాఖ(ఎస్‌జెఎస్‌డీ), హెరిటేజ్ ఫౌండేషన్ రీజనల్ రీసోర్స్ ట్రైనింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రేమసమాజం ఆడిటోరియం వేదికగా నిర్వహించిన జాతీయ సదస్సులో పలువురు వైద్యులు పాల్గొని వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రెండో రోజు సదస్సులో డాక్టర్ ఎం.శ్రీనివాసశాస్త్రి, డాక్టర్ జి. శోభాపెరిన్‌దేవి, డాక్టర్ భావరాజు సుబ్బారావు, ఎంకే రైనా, మృణాల్ లంకపల్లి పి.రెడ్డి వృద్ధులకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ కె.ఆర్.గంగాధరన్, డాక్టర్ ఎస్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

29లోగా లైసెన్స్ పొందాలి

- కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ గణేశన్

సీతంపేట: జిల్లాలోని దుకాణదారులు, వాణిజ్య వ్యాపార సంస్థలు ఈనెల 29 లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కార్మికశాఖ నుంచి లైసెన్స్ పొందాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.గణేశన్ ఓ ప్రకటనలో సూచించారు. దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటార్ రవాణా వాహన యజమానులు, అంతర్ రాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టం 1988 ప్రకారం విధిగా ఈ నెల 29లోగా మీ సేవా కేంద్రాలు/ఆన్‌లైన్/సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని.. సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్మిక చట్టాలన్నింటికీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పత్రం పొందే అవకాశం ఉందని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ పొందిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. గడువులోగా రిజిస్ట్రేషన్ పత్రం పొందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్) ఆధ్వర్యంలో విశాఖ పోర్ట్ అథారిటీ సహకారంతో 27 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లమో, ఇంజినీరింగ్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణులైన విశాఖ పోర్ట్ పరిసర ప్రాంత నిరుద్యోగ యువత శిక్షణకు అర్హులు. వీరికి కొరియర్ సూపర్‌వైజర్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సి.ఎన్.సి ఆపరేటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీ కృష్ణ శివ్వం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో గానీ, 99481 83865, 77948 40934, 0891-2704010ను సంప్రదించవచ్చు.

హత్య కేసులో ఒకరికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్: ఓ వివాదంలో ఒకరిని హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.2వేలు జరిమానా వేస్తూ.. నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.గోవర్ధన్ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.దేవానంద్ అందించిన వివరాలివీ.. నిందితుడు అద్దేపల్లి అప్పారావు(50) ఉమ్మడి విశాఖ జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామ నివాసి. వృత్తిరీత్యా కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. మృతుడు మంత్రి సత్తిబాబు కూడా అదే ప్రాంతానికి చెందిన వాడు. తన భార్యతో సత్తిబాబుకు అక్రమ సంబంధం ఉన్నట్లు అప్పారావు అనుమానించాడు. దీంతో వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2017 మే 21న సత్తిబాబు, అప్పారావుల మధ్య గొడవ జరగ్గా.. సత్తిబాబును ఇటుకలతో అప్పారావు కొట్టాడు. తీవ్ర గాయాల మధ్య ఉన్న సత్తిబాబుని స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. రోలుగుంట పోలీసులు అప్పారావుపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

గంజాయి సేవించిన ఏడుగురిపై కేసు

బీచ్‌రోడ్డు: గంజాయి సేవించిన ఇద్దరు విద్యార్థులు, మరో ఐదుగురిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏయూ శ్రీకృష్ణ దేవరాయ హాస్టల్‌లోని ఓ గదిలో విద్యార్థులు గంజాయి సేవిస్తున్నట్లు వర్సిటీ భద్రత సిబ్బందికి సమాచారం అందింది. వెంటనే హాస్టల్ వార్డెన్ సహకారంతో సిబ్బంది ఆ గదిని తనిఖీ చేశారు. గదిలో ఉన్న ఇద్దరు విద్యార్థులతో పాటు బయట నుంచి వచ్చిన మరో ఐదుగురు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించారు. వీరిపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్‌ఖాన్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య

అక్కిరెడ్డిపాలెం: గాజువాక శ్రీనగర్‌లోని శ్రీరాంనగర్‌లో ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గాజువాక సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. గాజువాకలోని ఓ ఇంటర్మీడియట్ కళాశాలలో ఓ విద్యార్థిని (17) ఇంటర్ ఎంపీసీ చదువుతోంది. ఆమె తండ్రి వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఈమె ఒక్కరే సంతానం. శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లిన విద్యార్థిని మధ్యాహ్నం ఇంటికి వచ్చేసింది. సాయంత్రం వంట గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. తర్వాత వచ్చిన తల్లిదండ్రులు విగతజీవిగా ఉన్న కుమార్తెను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింహవల్లీ తాయారుకు వెండి వాకిలి బహూకరణ

- రూ.21 లక్షల విలువైన 27 కిలోల వెండితో తయారీ


ఈవో శ్రీనివాసమూర్తికి వెండివాకిలిని అందజేస్తున్న దాత మస్తాన్‌రావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలోని సింహవల్లీ తాయారు సన్నిధికి వెండి వాకిలి శోభ చేకూరింది. రూ.21 లక్షలు విలువ చేసే 27 కిలోల వెండి వాకిలిని డాబాగార్డెన్స్‌కి చెందిన పువ్వాడ మస్తాన్‌రావు శుక్రవారం బహూకరించారు. ఉదయం కుటుంబ సమేతంగా వచ్చిన దాత సంబంధిత వెండి వాకిలిని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామి దర్శనం కల్పించి వేద పండితులతో ఆశీర్వచనం, ప్రసాదం అందించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు వంకాయల సాయినిర్మల, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో పాలూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంచే 'ఆపరేషన్ వాలెంటైన్'

- హీరో వరుణ్‌తేజ్


మాట్లాడుతున్న హీరో వరుణ్‌తేజ్

బీచ్‌రోడ్డు: ఆపరేషన్ వాలెంటైన్ చిత్రం దేశభక్తిని పెంపొందించేలా ఉంటుందని ఆ చిత్ర కథానాయకుడు వరుణ్ తేజ్ తెలిపారు. భారత జవాన్లపై పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన దాడి, ఆ తర్వాత పాకిస్తాన్ ఉగ్రవాదులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తీర్చుకున్న ప్రతీకారం వంటి అంశాలతో ఈ సినిమాను తీర్చిదిద్దినట్లు చెప్పారు. మార్చి ఒకటో తేదీన విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం వరుణ్‌తేజ్ విశాఖ వచ్చారు. ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్రంలోని పలు సన్నివేశాల గురించి వివరించారు. ఎయిర్ ఫోర్స్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కిన ఆపరేషన్ వాలెంటైన్ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కంచె తర్వాత అంతటి దేశ భక్తి ఉన్న సినిమా ఆపరేషన్ వాలెంటైన్ అని, ఇటువంటి సినిమాలో నటించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు కూడా పైలట్‌లుగా రంగప్రవేశం చేసిన నేపథ్యంలో హీరోయిన్ పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఈ సినిమా కోసం ఎయిర్‌ఫోర్స్ అధికారులను కలసి అనేక అంశాలను తెలుసుకున్నానని, వారి నిజ జీవితానికి దగ్గరగా ఈ సినిమా ఉంటుందని వెల్లడించారు.

'సిద్ధార్థ్‌రాయ్' అందరినీ అలరిస్తోంది

- హీరో దీపక్ సరోజ్


శ్రీకన్య థియేటర్‌లో హీరో, హీరోయిన్లతో కలసి చిత్రాన్ని వీక్షిస్తున్న హీరో తల్లి, వైఎస్సార్ సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి

తాటిచెట్లపాలెం: సిద్ధార్థ్‌రాయ్ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తోందని ఆ సినిమా హీరో దీపక్ సరోజ్ అన్నారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలైన సందర్భంగా రైల్వే న్యూకాలనీలోని శ్రీకన్య థియేటర్‌లో సినిమా యూనిట్ సందడి చేసింది. హీరో దీపక్ సరోజ్, హీరోయిన్ తన్వి నేగి, దర్శకుడు యశస్వి ప్రేక్షకుల మధ్య ఈ చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా దీపక్ సరోజ్ మీడియాతో మాట్లాడుతూ ఈ సినిమాను అర్జున్‌రెడ్డి, యానిమల్ చిత్రాలతో పోలుస్తున్నారన్నారు. ఈ సినిమా విడుదలైన ప్రతీ ప్రాంతంలో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. హీరోయిన్ మాట్లాడుతూ ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించడం సంతోషంగా ఉందన్నారు. హీరో దీపక్ తల్లి, వైఎస్సార్ సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ ఈ సినిమా కథ, కథనం, దర్శకత్వం, పాటలు చాలా బాగున్నాయని తెలిపారు. దీపక్ సరోజ్ ఇంతవరకు 48 సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించాడని, హీరోగా తొలి చిత్రం విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు తన కుమారుడిని ఆశీర్వదించాలని కోరారు.

విక్టోరియా ఆస్పత్రిలో సోలార్ ప్లాంట్ ప్రారంభం

- సీఎస్సార్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా


ఘోషాస్పత్రిలో సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: విక్టోరియా(ఘోష) ఆస్పత్రిలో 80 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. సీఎస్సార్‌లో భాగంగా ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా కంపెనీ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్ ద్వారా నెలకు 8 వేల నుంచి 9 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇక నుంచి ఆస్పత్రిలో విద్యుత్ కొరత సమస్య ఉండదని కలెక్టర్ చెప్పారు. ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కంపెనీ కేజీహెచ్, ప్రభుత్వ వసతి గృహాలు, ఇతర చోట్ల చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. విక్టోరియా ఆస్పత్రిలో కుర్చీలు కూడా సమకూర్చేందుకు ఈ కంపెనీ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.ఉష, డిప్యూటీ సూపరింటెండెంట్ మోహర్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ హెచ్ఆర్ హెడ్ డి.ఎస్.వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.